క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో బుధవారం వరంగల్‌కు చెందిన మ్యాక్సీ శరత్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు హెల్త్ కార్డులు వెంట తెచ్చుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయానికి విరాళం అందజేత



నగదు అందజేస్తున్న దాత సరోజిని

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయ అభివృద్ధికి సూర్యాపేటకు చెందిన క్షీరసాగర సరోజిని, తన భర్త కేటీ బాబురావు జ్ఞాపకార్థం రూ.50,116 విరాళం ప్రకటించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు ఆమె నగదు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణనందా దత్తగురుస్వామి, జాదవ్ సురేష్, రేగట్టి లింగయ్య, నీరుడు వెంకటరత్నం, రాజ్యం, రేగట్టి సత్యనారయణ, నీల వెంకట్రావ్, లింగమ్మ, పాపయ్య, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటాన్ని జయప్రదం చేయాలి

అర్వపల్లి: పూలే-అంబేద్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో అర్వపల్లిలో మంగళవారం నిర్వహించనున్న ప్రజా పోరాట పాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈదురు వీర పాపయ్య కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలుతోపాటు పలువురు నేతలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో గద్దర్, కారుపోతుల అంజన్నకు ఘన నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కల సురేందర్, నర్సింహ, కృష్ణయ్య, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

అర్వపల్లి : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దురాగతాన్ని ఖండిస్తూ మండలంలోని రామన్నగూడెం గ్రామ యువకులు ఆదివారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యురాలు చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువకులు వజ్జె సాయి, జశ్వంత్, కె.శంకర్, జడ శివ, లక్ష్మీమనోజ్, రాజు, నవీన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

జయంత్‌కు నివాళి



జయంత్ మృతదేహానికి పూలమాల వేస్తున్న రేఖ

అర్వపల్లి : మండలంలోని కుంచమర్తి గ్రామ పంచాయతీ కార్మికుడు మహంకాళి యుగేందర్ కుమారుడు జయంత్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సోమవారం జయంత్ మృతదేహాన్ని రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధి కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేసి, రేఖ ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో జంపాల శివ, మడ్డి శేఖర్, దోమల సైదులు, పేరెల్లి ఉప్పలయ్య, శ్రీకాంత్, మహేష్, శతకోటి జాని, సైదులు, శ్రీను, నాగరాజు, శంకర్, దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవకమ్మకు నివాళి

అర్వపల్లి: అర్వపల్లికి చెందిన కట్టెల దేవకమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని సోమవారం మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, మేకల రాంబాబు, బైరబోయిన పెద్దయ్య, కనుకు నాగరాజు, మల్లేష్, ప్రభు, పరమేష్, మధు, లింగస్వామి, సురేష్, నరేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో సోమవారం 2024- 25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో ఎస్సీ కేటగిరీలో- 1, బైపీసీలో ఎస్సీ కేటగిరీలో -1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది !



మంగళితండాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



రాజుతండాలో వీధుల్లో నిలిచిన మురుగు

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- వ్యాప్తి చెందుతున్న దోమలు
- నివారణ చర్యలు తీసుకోని అధికారులు

చివ్వెంల(సూర్యాపేట) : మండలంలోని పలు గ్రామాల్లో పరిశుభ్రత కరువైంది. ఆవాసాల మధ్యన మురుగు నిల్వలు పేరుకుపోయినా ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ నీరు, ఇళ్లలో వినియోగించిన వ్యర్థపు నీరు రోడ్లపై పారి మురుగు గుంతలు ఏర్పడి దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయి. ఇళ్ల మధ్యన మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు ముందు జాగ్రత్తగా దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపహాడ్, పాశ్యానాయక్‌తండా, బద్యాతండా, సేవాలాల్ తండా, లక్ష్మణ్‌నాయక్ తండా, పులితండా, బి.చందుపట్ల, మున్యానాయక్ తండా, గుంపుల, తిమ్మాపురం, మొగ్గయ్యగూడెం, మంగళి తండా, అక్కలదేవిగూడెం, పిల్లల జెగ్గుతండా గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా ఉంది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం వల్ల సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాల్లో డ్రెయినేజీలు ఉన్నా సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫాగింగ్, బ్లీచింగ్ చేసేవారే లేరు..

ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా అంతర్గత రోడ్లు మురుగు నీటి కుంటలుగా దర్శనమిస్తున్నాయి. కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో ఈగలు దోమలు గుడ్లు పెట్టి విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. ఫాగింగ్ చేయకపోవడంతో దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకపోవడంతో తుప్పుపడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోగాల బారిన పడుతున్నాం

గ్రామాల్లో మురుగు కాలువలు సరిగా పూడిక తీయకపోవడంతో ఇళ్ల ఎదుట మురుగు నీరు నిలుస్తోంది. దీని వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి మురుగు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. అదేవిధంగా దోమల నివారణకు ఫాగింగ్ చేయించి, సమస్యను పరిష్కరించాలి.

-ధరావత్ శ్రీనునాయక్, రాజుతండా

నివారణ చర్యలు చేపడుతున్నాం

గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించడంతోపాటు, ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. అవసరమైనచోట ఎక్కువగా జనాలు నివసించే ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా చేపడతాం. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. ప్రజలు గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా పంచాయతీ ట్రాక్టర్లలో మాత్రమే వేసి సహకరించాలి.

-సీహెచ్.సంతోష్‌కుమార్, ఎంపీడీఓ

బ్యాండ్ మేళం బృందానికి పరికరాలు అందజేత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన ధనియాకుల గురువయ్య-లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారులు ధనియాకుల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ సోమవారం బ్యాండ్ మేళం బృందానికి సాధన పరికరాలు, డ్రెస్ అందజేశారు. మునగాల, పెన్‌పహాడ్ మండలాల్లో ప్రసిద్ధి గావించిన నేలమర్రి గ్రామ బ్యాండ్ మేళం బృందానికి రూ.20వేలు విలువ చేసే బ్యాండ్ మేళం సాధన పరికరాలు, డ్రెస్ అందజేశారు.

రుణమాఫీ వర్తింపజేయాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : రైతులకు షరతులు లేకుండా ప్రభుత్వం రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్నా రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని కేవలం 40శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. మిగతా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేర్పుల లక్ష్మన్న, నాయకులు మామిడి సుధాకర్, మేనయ్య, అవిలయ్య, పేర్ల మల్లమ్మ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని ఆందోళన



చిల్పకుంట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

నూతనకల్ : జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సుజాత డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో నిందితులను శిక్షించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, కూసు జయసుధ, సుగుణమ్మ, రామతార, సోమమ్మ, మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



అర్వపల్లి : నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



మద్దిరాలలో నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటోగ్రాఫర్లు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లూయిస్‌డాగురే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎస్‌ఐ సురేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరి యాదగిరి, జిల్లా కోశాధికారి లాలూ, సురుగురు శ్రీనివాస్, కిష్టునాయక్, సుధీర్, భాస్కర్, గంగాధర్, అశోక్, నరేష్, శ్యామ్, అజ్జు, శ్రీనివాస్, జియా పాల్గొన్నారు.

అర్వపల్లి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అర్వపల్లిలో సోమవారం ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు శిగ జాని, మహేష్, శోభన్, కృష్ణ, పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల మండల అధ్యక్షుడు రాగిరి మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రపంచంలో మొదటి కెమెరాను కనుగొన్న ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డ్యాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాచమల్ల సంతోష్,తాళ్ళపెల్లి నారాయణ,ఆకుల నరేష్,చిలువేరు వెంకన్న,జంపాల అశోక్, రామలింగం, చంద్రయ్య, శివకృష్ణ, ప్రభాకర్, రామలింగం, లోకేష్, యాకయ్య, సంపత్ పాల్గొన్నారు.


ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ప్రధాన అర్చకులు శివరామకృష్ణ శర్మ అమ్మవారికి తెల్లవారుజామున 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు బ్రాహ్మాండ్లపల్లి బాలచంద్రుడు తకంగిణిలు అమ్మ వారికి సమర్పించిన పట్టు వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ ఉత్సవం నిర్వహించిన భక్తుల సహకారంతో తయారు చేయించిన బంగారు కంఠహారాన్ని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశంగుప్తా, బ్రాహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రాంమూర్తి, మల్లికార్జున్, ప్రభాకర్‌రావు, సోమయ్య, వెంకటేశ్వర్లు, అశోక్, గోపారపు రాజు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

మూసీ వంతెనపై ప్రమాదకరంగా గుంత



జాజిరెడ్డిగూడెం-వంగమర్తి వంతెనపై గుంత ఏర్పడి తేలిన చువ్వలు

అర్వపల్లి: నకిరేకల్-తానంచర్ల 365 జాతీయ రహదారిలో భాగంగా శాలిగౌరారం మండలం వంగమర్తి-జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం మధ్య మూసీ నదిపై నిర్మించిన వంతెనపై జాజిరెడ్డిగూడెం శివారులో పెద్ద గుంత ఏర్పడింది. వంతెనపై గుంత ఏర్పడి చువ్వలు తేలాయి. ఈ గుంత వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. హైవే అధికారులు వెంటనే గుంతను పూడ్చివేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక తీజ్

భానుపురి : బంజార సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక తీజ్ అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 16వ వార్డు తిరుమలనగర్ బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ ఆలయం వద్ద గిరిజనులు పెద్ద ఎత్తున తీజ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ సలిగంటి సరిత వీరేందర్, మాజీ ఎంపీపీ ధరావత్ వీరన్ననాయక్, మాజీ జడ్పీటీసీ జాటోతు రాజేష్ నాయక్ లు మాట్లాడుతూ గతంలో పల్లెలు, తండాల్లో నిర్వహించే తీజ్ పండుగను బంజారాలు ఎక్కడ ఉంటే అక్కడ నిర్వహించాలన్నారు. కనుమరుగవుతున్న బంజార సంస్కృతికి జీవం పోసేలా తొమ్మిదిరోజుల పాటు యువతులు పవిత్రంగా తీజ్ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్, కో-కన్వీనర్ ధరావత్ మంగత్యా, ధరావత్ అజయ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు ధారాసింగ్, రఘుపతి, డీటీ లాలు, హుస్సేన్, పాండు,నాగు,లాలు, బాలాజీ, కిషన్, తావుర్యా, నర్సింహ పాల్గొన్నారు.



తీజ్ వేడుకలో పాల్గొన్న గిరిజనులు

వైభవంగా శ్రీసుదర్శన సహిత లక్ష్మీనారసింహ హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల: మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శ్రావణ పూర్ణిమ, హయగ్రీవ జయంతి పురస్కరించుకుని సోమవారం శ్రీసుదర్శన సహిత నారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్చరణతో స్వామి పూజలు నిర్వహించి, హోమం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణ కుమార్, కట్టికోల మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీల వర్గీకరణను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని తిరుమలగిరి మున్సిపాలిటీ మాల మహానాడు అధ్యక్షుడు గంటా లక్ష్మణ్ కోరారు. ఆదివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ సవరణ జరుగకుండా వర్గీకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దళితులను రాజ్యాధికారం నుంచి దూరం చేసే కుట్రను తిప్పి కొట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు గంట సందీప్, కార్యవర్గ సభ్యులు సంపత్, మాణిక్యరావు, ప్రభుదాస్, యాకూబ్, సాల్మన్, రవి, బాబు తదితరులు కోరారు.

• అనుబంధాల ప్రతీక.. రాఖీ



అర్వపల్లి : అడివెంలలో సోదరుడికి రాఖీ కడుతున్న జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి రేఖ



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సామేల్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ

ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా శిక్ష విధించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య నాయకులు

హుజూర్‌నగర్ : మహిళలపై అత్యాచారాలను నిరోధించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే కఠిన శిక్షలు అమలు చేయాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడాన్ని ఖండిస్తూ సోమవారం హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రభుత్వాలు నిరోధించలేకపోతున్నాయని విమర్శించారు. జూనియర్ వైద్యురాలిపై అమానుషంగా అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులను ఉరితీయాలని ఆమె డిమాండ్ అన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై అత్యాచారాలు వేధింపులు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగాక హడావుడి చేసే ప్రభుత్వాలు మహిళలపై అత్యాచార సంఘటనలు జరగకుండా ఎందుకు నిరోధించలేక పోతున్నాయో ఆలోచించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కోశాధికారి, డాన్స్ మాస్టర్ కస్తాల వీరబాబు, మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దేవరం సుజాత, జిల్లా గౌరవ అధ్యక్షురాలు పశ్యా పిచ్చమ్మ, షేక్ మీరాబీ, షేక్ రేష్మ, వడ్లనపు పుల్లమ్మ, జెనిగ వెంకటమ్మ, షేక్ పర్వీన్, నాగలక్ష్మి, శైలజ, నరేష్, రాజేష్, రామకృష్ణ, సీతమ్మ, నాగేంద్ర, భవాని, పి.నాగ హర్షిత, రాజేష్, నరేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సరిపోని బస్సులు.. మహిళల పాట్లు



అర్వపల్లిలో బస్సు ఎక్కే చోట మహిళల రద్దీ

- రక్షాబంధన్ ఎఫెక్ట్‌తో కిటకిటలాడిన బస్సులు, రద్దీగా బస్టాండ్‌లు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయించిన మహిళలు

అర్వపల్లి : అన్నా- చెల్లెళ్లు, అక్కా- తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ పండుగ సందర్భంగా రాఖీ కట్టేందుకు వెళ్లే మహిళలు, యువతులు బస్సుల కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేస్తుండడంతో ఇప్పటికే బస్సుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్నారు. దీనికి తోడు సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో సూర్యాపేట- జనగామ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు కిటకిటలాడాయి. బస్సులు సరిపోక మహిళలకు ఇక్కట్లు తప్పలేదు. చాలీచాలని బస్సులతో మహిళలు బస్సులు ఎక్కే చోట తోపులాటలు కూడా జరిగాయి. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు నడిచినా అవి కూడా చాలలేదు. బస్‌స్టాపులు, బస్టాండ్‌లు మహిళలతో రద్దీగా మారాయి.



సరిపడా బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న మహిళలు

పంటలకు చీడపీడల బెడద



పెన్‌పహాడ్ మండలం అనంతారంలో సాగు చేసిన పెసర పంట

- పెసర, పత్తి, కంది రైతుల్లో ఆందోళన
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు

పెన్‌పహాడ్ : వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా పత్తి, కంది, పెసర పంటలను సాగు చేశారు. కాగా ప్రస్తుతం పెసర, పత్తి, కంది పంటలను చీడ పీడలు ఆశిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కంది పంటకు ఎండు తెగులు, వేరుకుళ్లు తెగులు సోకుతుంది. మండలంలోని ఐదు వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో జూన్ చివరి వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీనికి తోడు బోరుబావుల్లోను భూగర్భజలాలు అడుగంటాయి. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నీటిని విడుదల చేస్తే వరి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రైతుల్లో దిగులు

మండలంలో పత్తి 2500, పెసర 250, కంది 350 ఎకరాల్లో సాగు చేశారు. పెసర పంటను ఆశిస్తున్న తెల్లదోమ, పేనుబంక, రసం పీల్చే పురుగులు, జీడ తెగులు, మరక మచ్చ పురుగు వంటివి పంట దశ 30రోజుల నుంచి గింజ పట్టే దశ వరకు ఎక్కువగా పంటను ఆశిస్తుంటాయి. వాటి నివారణకు క్వినాల్‌పాస్ లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ లేదా క్లోరిఫైరిపాస్ లేదా మోనోక్రోటపాస్ 2.5ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వీటితో పాటే వేపనూనె 5ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పంటలపై చల్లితే చీడ పీడలను నివారించవచ్చు. కాయతొలిచే మరుక మచ్చల పురుగు నివారణకు ఇమోమెక్టిన్ బెంజోట్ మందును ఎకరాకు 60 నుంచి 80గ్రాముల చొప్పున 200లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలని అధికారులు సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



తక్కువ కాలంలో చేతికి వచ్చే పెసర పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. జీడ, మరుక మచ్చల పురుగు పెసర పంటను ఆశిస్తున్నాయి. పత్తిలో పేనుబంక, నల్లి, తెల్లదోమ, పచ్చదోమ పంటలను ఆశిస్తూ నష్టపరుస్తున్నాయి. పంట సాగులో అప్రమత్తంగా ఉండి చీడపీడల గుర్తించి వెంటనే మందులు పిచికారీ చేయాలి. పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏయే మందులు ఎంత మోతాదులో పిచికారీ చేయాలని నిరంతరం వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త